క్లుప్తంగా

లైసెన్స్‌లు ఇవ్వాలి



కామారెడ్డి రూరల్: పొరపాటున పోగొట్టుకున్న అడ్లూర్–2కు సంబంధించి టీఎఫ్‌టీ లైసెన్స్‌ల స్థానంలో డూప్లికెట్ లైసెన్స్‌లు జారీ చేయాలని మోకుదెబ్బ జిల్లా అధ్యక్షుడు నాగరాజుగౌడ్ ఆధ్వర్యంలో జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు.

అతివేగం ప్రమాదకరం



పెద్దకొడప్‌గల్: అతివేగం ప్రమాదకరం అని ఎస్సై కోనారెడ్డి పేర్కొన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు వేగాన్ని నియంత్రించేందుకు వీలుగా శనివారం మండలంలోని 161 నంబర్ జాతీయ రహదారి బేగంపూర్ చౌరస్తా వద్ద స్పీడ్ గన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇప్పటి వరకు జాతీయ రహదారిపై నాలుగు స్పీడ్ గన్స్ ఏరాపటు చేశామన్నారు. అతివేగంగా వెళ్తున్న వాహనాదారులను గుర్తించి జరిమానా విధిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది అంజి, రామేష్, శంకర్ పాల్గొన్నారు.

పరీక్షలు ఆత్మ విశ్వాసంతో రాయాలి



తాడ్వాయి: మండలంలోని చిట్యాల ప్రభుత్వ పాఠశాలలో శనివారం హెల్పింగ్ బ్రిడ్జ్ ఫర్ ఎడ్యుకేషన్ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు పరీక్షా సామాగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆ సంస్థ ప్రతినిధులు సంతోష్‌కుమార్ మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు భయం లేకుండా ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలని సూచించారు.

గర్భిణులకు పౌష్టికాహారం అందించాలి



పిట్లం: చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేణుక సూచించారు. శనివారం ఆమె పిట్లంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ కుమ్మరి రాధ, సిబ్బంది పాల్గొన్నారు.

చేపల పెంపకంతో లాభాలు



సదాశివనగర్: మండలంలోని భూంపల్లి గ్రామంలో నాబార్డు ఆధ్వర్యంలో మహిళా సంఘాలకు చేపల పెంపకంపై శిక్షణ నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధి చంద్రశేఖర్ మాట్లాడుతూ చేపల పెంపకం ద్వారా వ్యవసాయానికి అనుబంధంగా లాభసాటి వస్తుందన్నారు. సూచనలు, సలహాలు పాటిస్తే చేపల ద్వారా మంచి ఆదాయం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఏపీఎం రాజిరెడ్డి, సీసీలు రాములు, ఆంజనేయులు, నరేందర్ రెడ్డి, లింగం తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణకు గడువు పొడిగింపు

రామారెడ్డి/పెద్దకొడప్‌గల్: రామారెడ్డి మండలం ఉప్పల్‌వాయి, పెద్దకొడప్‌గల్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 5వ తరగతిలో ప్రవేశాల కోసం దరఖాస్తుల స్వీకరణ గడువు 20వ తేదీ వరకు పొడిగించినట్లు ఆయా కళాశాలలకు చెందిన ప్రిన్సిపాల్స్ సత్యనారాయణ, నళిని వేర్వేరుగా ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 23న పరీక్ష నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

ఆదుకున్న అకాల వర్షం

బాన్సువాడ రూరల్: నీరు లేక ఎండిపోతున్న మొక్కజొన్న పంటకు అకాల వర్షం ఆదుకుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని కోనాపూర్, హన్మాజీపేట్, కాద్లాపూర్, సంగోజీపేట్ తదితర గ్రామాల్లో ఈసారి మొక్కజొన్న పంటను విస్తారంగా సాగుచేశారు. ఈదురు గాలుల మూలంగా అక్కడక్కడా మొక్కజొన్న పంట కొంతమేర నేలకొరిగినా పెద్దగా నష్టం జరగలేదని పలువురు రైతులు వెల్లడించారు.

‘ధరణి’తో దళారులకు చెక్

- సజావుగా క్రయ, విక్రయాలు
- పైసా ఖర్చు లేకుండా సేవలు
- జెడ్పీ చైర్‌పర్సన్ దఫేదార్ శోభ



ధరణి సేవల గురించి తెలుసుకుంటున్న జెడ్పీ చైర్‌పర్సన్ దఫేదార్ శోభ

నిజాంసాగర్: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ధరణి సేవలతో దళారుల ప్రమేయం లేకుండా భూముల క్రయ విక్రయాలు, రిజిస్ట్రేషన్లు తదితర సేవలు సజావుగా సాగుతున్నాయని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ దఫేదార్ శోభ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ధరణి సేవలను వినియోగించుకొని ఆమె పొలం రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ధరణితో అవినీతి, అక్రమాలకు తావులేకుండా పోయిందన్నారు. భూముల అమ్మకాలు, కొనుగోళ్లకు మధ్యవర్తుల ప్రమేయం లేకుండా రైతులకు ఎంతో ఉపయోగంగా ఉందన్నారు. గతంలో సేవలకు వేల రూపాయలు ఖర్చు అయ్యేవని ప్రస్తుతం పైసా ఖర్చు లేకుండా ధరణి ద్వారా రిజిస్ట్రేషన్లు, పట్టాలు, పాసుపుస్తకాలు రైతులకు అందుతున్నాయని వెల్లడించారు. ఆమె వెంట ఉమ్మడి జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ దఫేదార్ రాజు, ఎంపీపీ పట్లోళ్ల జ్యోతి, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, నాయకులు దుర్గారెడ్డి, మనోహర్, సంగమేశ్వర్‌గౌడ్, లక్ష్మీనారాయణ, లక్ష్మారెడ్డి, వాజిద్ అలీ ఉన్నారు.

కష్టపడి చదివితే మంచి ఫలితాలు



మాట్లాడుతున్న హెచ్‌ఎం చారి

బాన్సువాడ రూరల్: పదోతరగతి వార్షిక పరీక్షలు దగ్గర పడుతున్నందున పిల్లలకు ఎలాంటి పనులు చెప్పకుండా తల్లిదండ్రులు సహకరించాలని కోనాపూర్ గ్రామ జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు చారి కోరారు. శనివారం సర్పంచ్ వెంకటరమణరావు, ఎంపీటీసీ సభ్యులు హన్మాండ్లు తదితరులతో కలిసి పదో తరగతి చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. రోజూ ఉదయం నాలుగు గంటలకు విద్యార్థులకు ఫోన్ చేసి ఉపాధ్యాయులు నిద్ర లేపుతున్నారని గుర్తు చేశారు. తల్లిదండ్రులు కూడా బాధ్యతగా భావించి అధిక మార్కులతో పాస్ అయ్యేలా సహకరించాలని కోరారు.

ఆర్టీసీ ద్వారా భద్రాద్రి సీతారాముడి తలంబ్రాలు



మాట్లాడుతున్న ఆర్టీసీ డిపో మేనేజర్ సదాశివ్

బాన్సువాడ టౌన్: భద్రాచలంలో ఈ నెల 30న జరగనున్న శ్రీ సీతారాముడి కల్యాణ తలంబ్రాల కోసం రూ. 116 చెల్లిస్తే ఆర్టీసీ కార్గో ద్వారా ఇంటి వద్ద అందజేస్తామని ఆర్టీసీ డిపో మేనేజర్ సదాశివ్ పేర్కొన్నారు. శనివారం ఆయన స్థానిక బస్‌డిపోలో లాజిస్టిక్స్‌ను ప్రారంభించారు. అన్ని కార్గో కౌంటర్లలో ముందస్తుగా బికింగ్ చేసుకునే అవకాశం ఉందని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిబ్బంది రాములు, ఇర్ఫాన్, సాగర్ తదితరులు ఉన్నారు.

ముదిరాజ్‌లు అన్ని రంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న పున్న రాజేశ్వర్

తాడ్వాయి: ముదిరాజ్ కులస్థులు అన్ని రంగాలలో రాణించాలని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పున్న రాజేశ్వర్ అన్నారు. మండలంలోని ఎర్రాపహాడ్‌లో శనివారం నిర్వహించిన పెద్దమ్మ కల్యాణ మహోత్సవానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముదిరాజ్‌లు ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం కావాలని సూచించారు. ఐకమత్యంగా ఉండి సమస్యలు పరిష్కరించు కోవాలని కోరారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘ నాయకులు బిక్షపతి, మహేష్, సాయిలు, రాజు, స్వామి, సుశీల్ పాల్గొన్నారు.

రసాయన ఎరువులు ఎక్కువ వాడొద్దు



పొలం వద్ద ఏవో అనిల్ కుమార్

లింగంపేట: మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన రైతులకు మండల వ్యవసాయశాఖ అధికారి అనిల్ కుమార్ శనివారం క్షేత్రస్థాయిలో పొలాల వద్దకు వెళ్లి వాటికి సోకిన తెగుళ్ల నివారణపై అవగాహన కల్పించారు. వ్యవసాయశాఖ అధికారుల సూచన మేరకు ఎరువులు వాడాలని, ఎక్కువ మోతాదులో రసాయన ఎరువులు వాడితే ఇబ్బందులు తలెత్తుతాయన్నారు. కార్యక్రమంలో ఏఈవో నవ్య, సర్పంచ్ కిషన్, రైతులు లక్ష్మి, మాన్కి, సబుత్ర పాల్గొన్నారు.

నాణ్యత లోపిస్తే చర్యలు

మాచారెడ్డి: డ్రైనేజీ, సిమెంట్ రోడ్ల నిర్మాణ పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తీసుకుంటామని ఎంపీపీ లోయపల్లి నర్సింగ్‌రావు పేర్కొన్నారు. శనివారం ఆయన మండలంలోని ఘన్‌పూర్‌లో చేపడుతున్న డ్రైనేజీ నిర్మాణ పనులను పరిశీలించారు. ఆయన వెంట ఉప సర్పంచ్ మల్లేష్‌యాదవ్, మాజీ కౌన్సిలర్ రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్ల ప్రారంభం

నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని ఆరేడ్ గ్రామంలోని చర్చి చౌరస్తా వద్ద శనివారం రాత్రి హైమాస్ట్ లైట్లను బీఆర్‌ఎస్ నాయకులు నారాయణ, గైని విఠల్ ప్రారంభించారు. అంతకుముందు చర్చివద్ద వారు కొబ్బరి మొక్కను నాటారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు దేవదాస్, గైని రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ కుటుంబానికి అండగా ఉంటాం



అంజయ్యకు నివాళులర్పిస్తున్న సిబ్బంది

భిక్కనూరు: మండలంలోని బస్వాపూర్ గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ అంజయ్య ఇటీవల మృతి చెందడంతో బాధిత కుటుంబ సభ్యులను శనివారం మండల పరిషత్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పరామర్శించి రూ.15 వేల ఆర్థిక సహాయం అందజేశారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో అంజయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో అనంత్‌రావు, ఎంపీవో ప్రవీణ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు దయాకర్, సదాశివ, రామక్రిష్ణ, ప్రశాంత్,రేణుక, సౌజన్య, సౌందర్య, లావణ్య, సుమలత పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం

కామారెడ్డి క్రైం: పే స్కేల్ అమలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేయడంతో ఐకేపీ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లో టీఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు మామిండ్ల రాజేందర్ ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సాయిలు, ఐకేపీ ఉద్యోగులు పాల్గొన్నారు.

కనీస వేతనాలు చెల్లించాలి



ధర్నా చేస్తున్న పశుమిత్ర యూనియన్ సభ్యులు

కామారెడ్డి టౌన్: పశు మిత్రులకు కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ, తెలంగాణ పశుమిత్ర వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కన్వీనర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 2,500 మంది ఎనిమిదేళ్లుగా పశుమిత్ర కార్మికులు మూగజీవాలకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ సుధాకర్‌కు అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా గౌరవ అధ్యక్షుడు రాజనర్సు, తెలంగాణ పశుమిత్ర వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు లలిత, ప్రధాన కార్యదర్శి రోజా, కోశాధికారి సునీత, లావణ్య, సునిత, భవాని తదితరులు పాల్గొన్నారు.

కెనాల్ కోసం స్థల పరిశీలన



బాన్సువాడ రూరల్: వర్ని మండలం సిద్దాపూర్ వద్ద నిర్మిస్తున్న రిజర్వాయర్ మెయిన్ కెనాల్ కోసం కోనాపూర్ వద్ద శనివారం అధికారులు, ప్రజాప్రతినిధులు స్థలాన్ని పరిశీలించారు. రిజర్వాయర్ నిర్మాణం పూర్తయితే చెరువుల్లోని నీటిని ప్రధాన కాలువ ద్వారా విడుదల చేసే అవకాశం ఉందని సర్పంచ్ వెంకటర మణరావు అన్నారు. ఇరిగేషన్‌శాఖ ఏఈ శ్రీనివాస్, ఎంపీటీసీ హన్మాండ్లు, ఉప సర్పంచ్ సాయిలు స్థలాన్ని పరిశీలించారు.

చైతన్యం నింపే కవితలు రాయాలి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కవులు, రచయితలు

కామారెడ్డి అర్బన్: సమాజంలోని అసమానతలు, రుగ్మతలను సాహిత్యంలోకి తర్జుమా చేయగలిగే నైపుణ్యం కలిగి ఉన్న కవుల రచనలే ప్రజాభిమానాన్ని పొందుతాయని తెలంగాణ రచయితల వేదిక (తెరవే) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండి మల్లారెడ్డి అన్నారు. యెనిశెట్టి గంగాప్రసాద్ రాసిన ‘పొద్దు పొడుపు సూరీడు’ పుస్తకావిష్కరణ సభ శనివారం స్థానిక జిల్లా గ్రంథాలయ సంస్థలో తెరవే జిల్లా అధ్యక్షుడు గఫూర్ శిక్షక్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ జనం పక్షాన నిలబడి ప్రశ్నించే రచయితలను సాహిత్యకారులుగా గుర్తించేందుకు పాలకపక్షాలు ఇష్టపడడం లేదన్నారు. ‘పొద్దుపొడుపు సూరీడు’లో గంగాప్రసాద్ సమాజాన్ని కదిలించి చైతన్యం నింపే విధంగా కవితలు, గేయాలు రాశారని అన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పి.రాజేశ్వర్ మాట్లాడుతూ కవులు, రచయితలు సమాజం బాగుపడాలనే తపనతో రచనలు చేస్తున్నారని అన్నారు. తెరవే ప్రతినిధులు సూరారం శంకర్, అల్లి మోహన్ రాజ్, యెంబరి లింగం, నమిలికొండ సునీత, మంద పీతాంబర్, కాసర్ల రామచంద్రం, తిరుపతి, కరుణకర్, శంకర్, నాగభూషణం, రాజిరెడ్డి పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలి



రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీవో శ్రీనివాస్

నాగిరెడ్డిపేట: వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా చూసుకోవాలని ఎంపీవో శ్రీనివాస్ సూచించారు. మండలంలోని జప్తిజాన్కంపల్లి పంచాయతీ కార్యాలయాన్ని శనివారం ఆయన తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట సర్పంచ్ సాయిలు, పంచాయతీ కార్యదర్శి ప్రదీప్‌కుమార్ తదితరులు ఉన్నారు.

అభివృద్ధికి సహకరించండి

పిట్లం: పన్నులు సకాలంలో చెల్లించి పిట్లం పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని పంచాయతీ కార్యదర్శి యాదగిరి కోరారు. శనివారం ఆయన మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, సిబ్బందితో కలిసి పన్ను వసూలుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు.

విద్యార్థులకు శిక్షణ



శిక్షణ పొందిన విద్యార్థులు

కామారెడ్డి అర్బన్: కంపెనీల్లో ఉద్యోగం పొందేందుకు నైపుణ్యంపై కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల విద్యార్థులకు రుబీకాన్ కనెక్ట్ సంస్థ ఆధ్వర్యంలో ఐదు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ శనివారం ముగిసింది. కమ్యూనికేషన్ స్కిల్స్, ఇంటర్వ్యూ, టైం మేనేజ్‌మెంట్ తదితర వాటిపై శిక్షణ ఇవ్వడం పట్ల కళాశాల ప్రిన్సిపల్ కె.కిష్టయ్య రుబీకాన్ కనెక్ట్ సంస్థ ట్రైనర్ శ్రీనివాస్ కుమార్‌ను అభినందించారు. కార్యక్రమంలో టాస్క్ కళాశాల సమన్వయకర్త ఫర్హీన్ ఫాతిమా, మెంటర్ అజరుద్దీన్, రిలేషన్‌షిప్ మేనేజర్ శ్రీనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేతల్లో జోష్



దోమకొండలో కాంగ్రెస్ నాయకుల ర్యాలీ

దోమకొండ: పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేపట్టిన జోడో యాత్రకు బయలుదేరే ముందు మండల కేంద్రంలో శనివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రధాన వీధులగుండా చేపట్టిన ర్యాలీలో కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. దోమకొండ, బీబీపేట మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు అనంతరెడ్డి, రమేష్, నాయకులు సీతారాం మధు, గోపాల్‌రెడ్డి, బాల్‌రాజ్, స్వామి, ప్రసాద్, రాజలింగం, మల్లేశం పాల్గొన్నారు.



భిక్కనూరు నుంచి కామారెడ్డికి..

భిక్కనూరు: కామారెడ్డిలో పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి నిర్వహించిన సభకు మండలంలోని పలు గ్రామాల నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు శనివారం తరలివెళ్లారు. ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చారని కాంగ్రెస్ పార్టీ బ్లాక్ అధ్యక్షుడు బల్యాల సుదర్శన్, జిల్లా కార్యదర్శి లింబాద్రి, పట్టణ అధ్యక్షుడు అందే దయాకర్‌రెడ్డి తెలిపారు.

సమాచారం..

• రేపు తైబజార్‌కు వేలం పాట

నిజాంసాగర్(జుక్కల్): జుక్కల్ మండల కేంద్రంలో సోమవారం వారాంతపు, రోజు వారి సంత తైబజార్ వేలం పాట నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ రాములు సేట్ తెలిపారు. వారాంతపు సంతకు రూ. 50 వేలు, రోజు వారి సంతకు రూ. 40 వేలు డిపాజిట్ చేయాల్సి ఉంటుందన్నారు. రుపాయలను డిపాజిట్ చేయాల్సి ఉంటుందన్నారు. జుక్కల్ మార్కెట్‌లోని గాంధి చౌక్ వద్ద వేలం పాట ఉంటుందని ఉంటుందని ఆయన తెలిపారు.

• భీమన్న సాహితి పీఠం తృతీయ మహాసభ..

బాన్సువాడ రూరల్: మండలంలోని శ్రీరాం నారాయణ ఖేడియా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం భీమన్న సాహితీ పీఠం బాన్సువాడ తృతీయ మహాసభ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ గంగాధర్ తెలిపారు. మహాసభలో భాగంగా కళాశాలకు చెందిన అతిథి అధ్యాపకులు సుప్పని సత్యనారాయణ రచించిన సుప్పని శతకం, సరాసమీరం గ్రంథాలను ఆవిష్కరించనున్నట్లు వెల్లడించారు.

• 24న మండల సర్వసభ్య సమావేశం

ఎల్లారెడ్డి: మండల సర్వసభ్య సమావేశం 24న ఎంపీపీ మాధవి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో నారాయణ తెలిపారు. సమావేశానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

ఆధ్యాత్మికం

■ ఘనంగా ఉర్సు



బీబీపేట: మండల కేంద్రంలోని పెద్ద చెరువు కట్టపై ఉన్న సయ్యద్ సాహెబ్‌ల దర్గా ఉర్సు శనివారం ప్రారంభించినట్లు నిర్వాహకులు సయ్యద్ తాలే అలీ శాఖాద్రి తెలిపారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం ప్రధాన వీధుల గుండా ప్రార్థనలు చేస్తూ చెరువు కట్ట వద్దకు చేరుకొని దర్గాలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాడి పంటలు సమృద్ధిగా ఉండాలని, ప్రజలందరు సుఖశాంతులతో ఉండాలని ప్రార్థనలు చేసినట్లు వెల్లడించారు.

■ ఆంజనేయస్వామి ఆలయానికి వెండి విగ్రహం

దోమకొండ: మండల కేంద్రం శివారులోని అముదాలపల్లి ఆంజనేయస్వామి ఆలయానికి శనివారం గ్రామానికి చెందిన చింతల రాజు 11 తులాల వెండి ఆంజనేయస్వామి విగ్రహాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆలయకమిటీ సభ్యులు కొండల్ రెడ్డి, అంజల్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, నాయిని లింగం, శ్రీకాంత్‌చారి, పోశయ్య, నరేష్, కాశిరెడ్డి, కిష్టారెడ్డి, నికిల్, అంజనేయస్వామి మాలధారులు, తదితరులు పాల్గొన్నారు.

■ ఘనంగా ఎడ్లబండ్ల ప్రదర్శన



లింగంపేట: మండలంలోని బోనాల్, అయ్యపల్లి గ్రామాల్లో శనివారం ఎడ్లబండ్ల ప్రదర్శన నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని ప్రధాన వీధుల గుండా డప్పువాయిద్యాలతో ఎడ్లబండ్లను ఊరేగించి ప్రభుస్వామి ఆలయం చుట్టు భక్తులు ప్రదక్షిణలు చేసి మొ క్కులు తీర్చుకున్నారు. ఆదివారం రథోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

■ హనుమాన్ ఆలయంలో భక్తుల సందడి..

మద్నూర్: మండలంలోని సలాబత్‌పూర్ హనుమాన్ ఆలయం శనివారం భక్తులతో సందడిగా మారింది. ఆలయ అర్చకులు అరవింద్, శైలేంద్ర మహారాజ్ ప్రత్యేక అభిషేక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన శ్రీరామ, లక్ష్మణ విగ్రహాలకు పూజలు నిర్వహించారు. సాయంత్రం విగ్రహాలను పల్లకీలో ఊరేగించారు.



సదాశివనగర్: మండల కేంద్రంలోని శ్రీ కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవాల్లో భాగంగా శుక్రవారం అర్ధరాత్రి రథోత్సవం నిర్వహించారు. రథాన్ని లాగేందుకు యువకులు పోటీపడ్డారు. సర్పంచ్ బద్దం శ్రీనివాస్ రెడ్డి, ఉప సర్పంచ్ వంకాయల రవి, ఎంపీటీసీ బీరయ్య, ఆలయ కమిటీ చైర్మన్ కొప్పుల నర్సారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

ఔషధ మొక్కల పెంపకంపై అవగాహన

భిక్కనూరు: కామారెడ్డి, భిక్కనూరు, మాచారెడ్డి, లింగంపేట్ మండలాలకు చెందిన పలువురు రైతులు ఘట్‌కేసర్‌లోని సీఎస్ఐఆర్–సీఐఎంఏపీ ఇన్‌స్టిట్యూట్‌ను శనివారం సందర్శించారు. రిలయన్స్ ఫౌండేషన్, ఉద్యానవనశాఖ ఆధ్వర్యంలో ఔషధ, సుగంధ మొక్కల పెంపకం ప్రాసెసింగ్ గురించి అవగాహణ కల్పించినట్లు తెలిపారు. రైతులతో పాటు కామారెడ్డి జిల్లా ఉద్యానవనశాఖ అధికారి రామక్రిష్ణ, రిలయన్స్ పౌండేషన్ ప్రతినిధి భూపతి పాల్గొన్నారు.

రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌కు భారీ స్పందన

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలో ఎస్ఆర్‌కె డిగ్రీ, పీజీ కళాశాలలో ఐసీఐసీఐ బ్యాంక్ ఆధ్వర్యంలో రిక్రూట్‌మెంట్ డ్రైవ్ కార్యక్రమం ద్వారా 150 మంది విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహించారు. అర్హత సాధించిన వారికి ఉద్యోగ అవకాశాలు ఇస్తామని ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్, సిఈవో ఎం.జైపాల్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ దత్తాత్రి, మధుసూదన్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్స్ తిరుపతి రెడ్డి, బాల్‌రెడ్డి, ఏవో దత్తు కుమార్, చెన్నారెడ్డి పాల్గొన్నారు.

జన చైతన్య యాత్రకు తరలిరండి



కామారెడ్డి టౌన్: సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జన చైతన్య యాత్రను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వెంకట్‌గౌడ్ కోరారు. శనివారం జిల్లా కేంద్రంలో యాత్రకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. కేంద్రం చేపడుతున్న కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా యాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. మోతిరాం నాయక్, నర్సింలు, అరుణ్, రాజు, మల్లేష్, రవిచంద్ర పాల్గొన్నారు.

టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌ను అరెస్టు చేయాలి

బాన్సువాడ టౌన్: టీఎస్‌పీఎస్సీ చైర్మన్ జనార్ధన్‌రెడ్డిని అరెస్ట్ చేసి విచారణ జరపాలని లంబాడి స్టుడెంట్ ఆర్గనైజేషన్ (ఎల్ఎస్‌వో) జిల్లా అధ్యక్షుడు జీవన్ డిమాండ్ చేశారు. శనివారం బాన్సువాడలో మాట్లాడుతూ పోటీ పరీక్షలకు సంబంధించిన ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎల్ఎస్‌వో నాయకులు శ్రీనివాస్‌నాయక్, నవీన్ ఉన్నారు.

కలుపు మొక్కలు తొలగించాలి

నాగిరెడ్డిపేట: నర్సరీలో కలుపు మొక్కలను తొలగించాలని ఎంపీడీవో రఘు సూచించారు. మండలంలోని జగంచెరువు తండా పచాయతీ పరిధిలోని ఏర్రకుంటతండాలో ఏర్పాటు చేసిన నర్సరీని శనివారం ఆయన తనిఖీ చేశారు. ఆయన వెంట ఉప సర్పంచ్ గోప్యా, పంచాయతీ కార్యదర్శి అనిత, వన సేవకుడు పీర్‌సింగ్, నాయకులు హరిలాల్ ఉన్నారు.

సిమ్‌కార్డుల పంపిణీ

ఎల్లారెడ్డిరూరల్: మండలంలో ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు సిమ్‌కార్డులను పంపిణీ చేసినట్లు ఎంపీడీవో నారాయణ, ఎంపీవో ప్రకాష్ తెలిపారు. సిమ్ కార్డులను సద్వినియోగం చేసుకోవాలని వారికి ఎంపీడీవో, ఎంపీవో సూచించారు.